నమస్తే తెలంగాణ DISTRICT SUPPLEMENT

# వికారాబాద్

బుధవారం 8 నవంబర్ 2023
WEDNESDAY, NOVEMBER 8, 2023
VIKARABAD
పేజీలు : 12
PAGES



కోస్గిలోని సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

## రేవంత్ ఓటమి ఖాయం

- ఆయన చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మరు
- ఎన్నడూ రానోడికి ఓటు అడిగే హక్కులేదు
- నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు నరేందర్‌రెడ్డి
- కోస్గి సమావేశంలో మంత్రి మహేందర్‌రెడ్డి
- 9న నామినేషన్.. కొడంగల్‌కు మంత్రి కేటీఆర్ రాక
- పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపు
- కొడంగల్ పట్టణంలో బొంరాస్‌పేట, దుద్యాల మండలాల బీఆర్‌ఎస్ శ్రేణుల సమావేశం
- మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల చేరిక

7వ పేజీలో..

'అబద్ధాల రేవంత్‌రెడ్డి.. నీవు ఓడిపోవడం ఖాయం.. నీ కల్లబొల్లి మాటలను కొడంగల్ నియోజకవర్గ ప్రజలు నమ్మరు..' అని గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోస్గి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు ఎన్నడూ రాని రేవంత్‌రెడ్డికి ఓటు అడిగే హక్కు లేదన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ నెల 9వ తేదీన ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమానికి ఐటీ మంత్రి కేటీఆర్ హాజరుకానున్న సందర్భంగా బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కొడంగల్ పట్టణంలో బొంరాస్‌పేట, దుద్యాల మండలాల బీఆర్‌ఎస్ శ్రేణుల సమావేశం జరుగగా, మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు.

– కోస్గి/బొంరాస్‌పేట, నవంబర్ 7



## మత్స్య సిరులు

### వికారాబాద్ జిల్లాలో నీలి విప్లవం

- ఏటా భారీగా పెరుగుతున్న మత్స్య సంపద
- ఉచిత చేప పిల్లల పథకంతో అద్భుతాలు
- ఏటా 5వేల టన్నులకుపైగా చేపల ఉత్పత్తి
- ఏడేండ్లలో 31,508 టన్నుల దిగుబడి
- ఇన్నేండ్లలో మత్స్యకార కుటుంబాలకు ఒనగూరిన సంపద రూ.402 కోట్లు
- మత్స్యకార్మికుల జీవితాల్లో కొత్త వెలుగులు

8వ పేజీలో..

గత ప్రభుత్వాలు మత్స్యకారులను విస్మరించడంతో వృత్తిని వదిలి ఏదో ఒక పని చేస్తూ కాలం వెళ్లదీసే దుస్థితి ఉండేది. కానీ.. రాష్ట్రం సిద్ధించాక మత్స్యకారుల బతుకులు మారాయి. సర్కారు చేయూతతో వాళ్ల జీవితాల్లో వెలుగులు నిండాయి. 'మిషన్ కాకతీయ'తో చెరువులు, కుంటల పునరుద్ధరణతో ఏడాదంతా నీరు నిల్వ ఉండడం, నీలి విప్లవం పేరుతో వంద శాతం సబ్సిడీతో చేప పిల్లలను పంపిణీ చేయడం వారికి వరంగా మారింది. వలలు, ద్విచక్ర వాహనాలు, టీవీఎస్ చాంప్ మోపెడ్లు, ఆటోలు, బొలెరో వాహనాలనూ అందించి మత్స్యకారుల బతుకులకు భరోసానిచ్చింది. నిరంతరం ఉపాధి లభిస్తుండడంతో మత్స్యకారుల్లో నూతనోత్సాహం నెలకొన్నది. వికారాబాద్ జిల్లాలో మత్స్య సిరులు కురుస్తున్నాయి. నీలి విప్లవం పేరుతో తెలంగాణ ప్రభుత్వం అందించిన సహకారంతో అద్భుత ఫలితాలు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా ఏడేండ్లలో 4.73 కోట్ల చేప పిల్లలను వంద శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందజేసింది. ఈ చేపలను 692 చెరువుల్లో పెంచగా, 31,508 టన్నుల దిగుబడి రావడంతో మత్స్యకారుల పంట పండింది. ఫలితంగా రూ.402 కోట్లకుపైగా మత్స్యకారుల కుటుంబాలకు సంపద చేకూరింది.

– వికారాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ)

## ప్రచార హోరు

- జిల్లాలో విస్తృతంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం
- ఏ గ్రామానికెళ్లినా బ్రహ్మరథం పడుతున్న జనం
- అభ్యర్థులకు హారతులు పడుతూ మద్దతు
- గడపగడపకూ వెళ్లి మ్యానిఫెస్టోను వివరిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు
- సమావేశాలు, సభలతో ఎమ్మెల్యే అభ్యర్థులు బిజీబిజీ

లోపలి పేజీల్లో..

జిల్లాలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథంపడుతున్నారు. అభ్యర్థులకు హారతులు పడుతూ తమ మద్దతును తెలుపుతున్నారు. అభ్యర్థుల బంధువులతో పాటు బీఆర్‌ఎస్ శ్రేణులు గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తెలుపుతూ బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తున్నారు. అభ్యర్థులు సమావేశాలు, సభలతో ప్రచారం నిర్వహిస్తున్నారు.

– న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ



పెద్దేముల్ మండలం.. జయరాంతండాలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద యాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి



రావులపల్లిలో పరిస్థితిని అదుపులోకి తెస్తున్న పోలీసులు

## కొడంగల్‌లో కాంగ్రెస్ దౌర్జన్యం

- ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులతో గొడవ
- రావులపల్లికి చేరుకున్న మంత్రి, ఎమ్మెల్యే
- పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు

కొడంగల్, నవంబర్ 7: కొడంగల్ నియోజకవర్గంలో మరోసారి ఓడిపోతామనే భయంతో కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యానికి దిగుతున్నది. మంగళవారం రాత్రి మండలంలోని రావులపల్లి గ్రామంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులతో కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగారు. ఈ ఘర్షణ ఇరు పార్టీల నాయకుల మధ్య ఉద్రిక్తతకు దారి తీయడంతో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిలు ఆ గ్రామానికి చేరుకున్నారు. డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ రాములు ఆధ్వర్యంలో పోలీసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.